అంతర్జాతీయ స్థాయిలో సిల్వర్ మెడల్

సిల్వర్ మెడల్ తో శరత్‌కళ్యాణ్

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 15: ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన శరత్‌కళ్యాణ్ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన టార్గెట్‌బాల్‌లో సిల్వర్‌మెడల్ సాధించినట్లు స్థానికులు శుక్రవారం తెలిపారు. ఈనెల ఎనిమిది నుంచి 12వ తేదీ వరకు నేపాల్‌లోని ఖాట్మాండులో అండర్-17 బాలుర విభాగంలో నిర్వహించిన టార్గెట్‌బాల్‌లో పోటీల్లో ఇండియా, నేపాల్, భూటాన్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల క్రీడాకారులు పాల్గొన్నారని అన్నారు. కాగా ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన శరత్‌కళ్యాణ్ సిల్వర్ మెడల్ సాధించినట్లు వారు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో మెడల్ సాధించిన శరత్ కళ్యాణ్‌కు తల్లిదండ్రులు, స్నేహితులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

దోమల నివారణ మందు పిచికారీ

నిజాంసాగర్, డిసెంబర్ 15: మహ్మద్‌నగర్ మండలంలోని సింగీతం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి గంగా ప్రకాశ్ పంచాయతీ కార్మికులతో శుక్రవారం దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పలు కాలనీల్లో నిల్వ ఉన్న నీరు, మురికి కాలువల్లో మందును పిచికారీ చేయించారు. అనంతరం ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించారు. దీంతోపాటు మురికి కాలువలను శుభ్రం చేయించారు. వారి వెంట ఆశ కార్యకర్త ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

పూజల్లో పాల్గొన్న భక్తులు

నిజాంసాగర్, డిసెంబర్ 15: మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి గ్రామ హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఆలయంలో నవగ్రహాలతోపాటు కూర్మ, నాగదేవతా విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారు. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, ప్రాణ ప్రతిష్ఠ, హోమం తదితర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అంజనాద్రి ఆలయ వ్యవస్థాపకుడు కిశోర్‌కుమార్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, సర్పంచ్ సాయిలు, నాయకులు విఠల్‌రెడ్డి, విఠల్‌గౌడ్, పండరి, సుదర్శన్‌రెడ్డి, రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి, డిసెంబర్ 15: మండలంలోని బ్రహ్మాజివాడి స్టేజి వద్ద శుక్రవారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువ పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై ఆంజనేయులు హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీటు బెల్టు ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన పలువురికి జరిమానాలు విధించారు.

ఘనంగా ఆరట్టు

- ఎల్లారెడ్డిలో అయ్యప్ప మాలధారుల పేటతుళ్లి
- ఉత్సవ విగ్రహానికి పెద్ద చెరువులో చక్రస్నానం

ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న మాలధారులు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 15: ఎల్లారెడ్డి పట్టణంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆరట్టు ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి శ్రీనివా స్‌రావు, గురుస్వాములు చంద్రం, హనుమంతప్ప కలిసి అందంగా అలంకరించిన ట్రాక్టర్‌పై అయ్యప్ప ఉత్సవ విగ్రహం, చిత్రపటాన్ని ఉంచి దీక్షాధారులతో కలిసి శరణు ఘోష, పాటలు, నృత్యాలతో శోభాయాత్రను ప్రారంభించారు. అయ్యప్ప ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర శివాజీచౌక్, వైశ్యభవన్, డెయిలీ మార్కెట్, గాంధీచౌక్, బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా మీదుగా స్థానిక పెద్ద చెరువు వద్దకు చేరుకున్నది. దారి పొడుగునా అయ్యప్పస్వామికి మంగళహారతులు, దీక్షాధారులకు పాదపూజ చేస్తూ, పువ్వులు చల్లుతూ భక్తులు స్వాగతం పలికారు. పెద్ద చెరువు వద్ద ఆలయ పూజారి శ్రీనివాస్‌రావు స్వామి వారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేయగా.. దీక్షాధారులు స్వామివారి విగ్రహానికి చక్రస్నానం చేయించారు. దీక్షాధారులు చెరువు కట్టపై ఉన్న గంగమ్మ ఆలయంలో భిక్ష చేశారు. గురుస్వాములు రాజేందర్‌నాథ్, శ్రీకాంత్‌రెడ్డి, అవుసుల సంతోష్, ఓర భీమయ్య గుప్తా, పంతంగి రాజ్‌కుమార్, తరుణ్, వంగపల్లి కాశీనాథ్, జక్కుల యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, అన్న శివకుమార్, గోజె అమృత్‌రావు, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో మాలధారుల పేటతుళ్లి

ఎల్లారెడ్డి పెద్ద చెరువులో ఉత్సవ విగ్రహానికి చక్రస్నానం చేయిస్తున్న మాలధారులు

విద్యార్థినులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం

మానసిక వైద్య నిపుణుడు రమణ

విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న మానసిక వైద్య నిపుణుడు రమణ

సదాశివనగర్, డిసెంబర్ 15: విద్యార్థినులు మానసిక ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని మానసిక వైద్య నిపుణుడు రమణ, సదాశివనగర్ ప్రాథమిక కేంద్రం వైద్యురాలు ఆస్మా అన్నారు. మండలంలోని మర్కల్ గ్రామ శివార్లో ఉన్న సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కాలేజీలో విద్యార్థినులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ మాట్లాడుతూ.. విద్యార్థినులు ఒక ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం కావాలని, మానసిక ఒత్తిడికి దూరంగా ఉండాలని సూచించారు. పరీక్షల్లో ఫెయిల్ అయితే ఆత్మహత్యా ప్రేరేపిత ఆలోచనలను అధిగమించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మానసిక ఆరోగ్య సామాజిక కార్యకర్త డాక్టర్ వి.రాహుల్ కుమార్, డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రేణుక, ఎన్ఎస్ఎస్ అధికారిణి అనిత, కళాశాల హ్రైల్ సూపర్‌వైజర్ డాక్టర్ హరిణి, వనజ, ఆరోగ్య కార్యకర్త వజ్రమ్మ, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిజాంసాగర్, డిసెంబర్ 15: మండలంలోని పలు గ్రామాల్లో నేడు(శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్చంపేట, నిజాంసాగర్, మల్లూర్, నర్సింగ్‌రావ్‌పల్లి (మంగ్లూర్) 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో శనివారం నెల వారీ నిర్వహణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మల్లయ్యపల్లిలో బోనాల పండుగ

బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 15: మండలంలోని మల్లయ్యపల్లి గ్రామంలో శుక్రవారం ముత్యాల పోచమ్మ, నల్ల పోచమ్మకు గ్రామస్తులు బోనాలను సమర్పించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి బోనాలను తీసుకొని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అమ్మవార్ల ఆలయాలకు ఆటపాటలతో ఊరేగింపుగా తరలివెళ్లారు. బోనాలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య, మాజీ సర్పంచ్ బోనగిరి చంద్రకళా వెంకటేశం, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పుస్తె, మెట్టెల అందజేత

మద్నూర్, డిసెంబర్15: మండలంలోని లస్మాపూర్ గ్రామానికి చెందిన అనాథ అనిత పెండ్లి శుక్రవారం జరిగింది. ఆమె పెండ్లికి మద్నూర్‌కు చెందిన పశువైద్యాధికారి విజయ్ కుమార్ పుస్తె,మెట్టెలను అందజేశారు. అనాథలకు తాను అండగా ఉంటానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

పుస్తె, మెట్టెలను అందజేస్తున్న డాక్టర్ విజయ్‌కుమార్

బస్సు సౌకర్యం కల్పించాలని డీఎంకు వినతి

డీఎం ఇందిరకు వినతిపత్రాన్ని అందజేస్తున్న అడ్లూర్ ఎల్లారెడ్డి ఎంపీటీసీ

సదాశివనగర్, డిసెంబర్ 15: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిరకు ఎంపీటీసీ సంకరి లక్ష్మీ రాజలింగం ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ.. అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో పది వేల వరకు జనాభా ఉంటుందన్నారు. 44న నంబర్ జాతీయ రహదారికి కిలోమీటర్ దూరంలో ఉండడంతో బస్సులు గ్రామం లోపలికి రావడం లేదన్నారు. కామారెడ్డి, నిజామాబాద్, బాన్సువాడ, హైదరాబాద్ తదితర దూర ప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉన్నదని వినతి పత్రంలో పేర్కొన్నారు. బస్సు సౌకర్యం కల్పించేందుకు డీఎం ఇందిర సానుకూలత వ్యక్తం చేశారని ఎంపీటీసీ తెలిపారు. కార్యక్రమంలో గాజుల అజీమ్, ఆస శంకర్, సంకరి లింగం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ సేవ

ఆశ్రమంలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

తాడ్వాయి, డిసెంబర్ 15: తాడ్వాయిలోని సద్గురు శబరి మాత ఆశ్రమంలో మాతా భక్తులు పల్లకీసేను గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆశ్రమానికి పలు ప్రాంతాల నుంచి భక్తులు గురువారం రాత్రి చేరుకున్నారు. మొదట మాత పాదుకలకు పూజ నిర్వహించారు. అనంతరం పల్లకీ సేవను వైభవంగా చేపట్టారు. ఆశ్రమంలో భజన కార్యక్రమాలు కొనసాగాయి.